ఉత్తరం
TG TEL/25/A1234 www.kakatiyanews.com
# కాకతీయ
మంగళవారం 04 ఆగష్టు, 2026 | సంపుటి - 01 సంచిక - 356 | పేజీలు - 6 + 6 వెల - 5

## సుదర్శన్‌రెడ్డిపై ఒత్తిడి జరిగిందన్నది వాస్తవమే

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- సివిల్ సప్లైస్, బంకర్ బెడ్స్ వ్యవహారాలను బయటపెట్టారని వ్యాఖ్య
- కాళేశ్వరం, బీసీ రిజర్వేషన్లు, గురుకులాలపై కాంగ్రెస్‌పై విమర్శలు



2లో

# దానం కామెంట్స్ వెనుక లెక్కలేంటి..?

- కాంగ్రెస్‌లోనే ఉంటానంటూనే కేసీఆర్ వ్యూహాలకు ప్రశంసలు
- 'కేటీఆర్-హరీశ్ బీఆర్ఎస్‌కు పెద్ద అసెట్' అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు
- హైడ్రా, నిధులపై ప్రభుత్వంపై పరోక్ష అసంతృప్తి
- జీహెచ్ఎంసీ ఎన్నికల వేళ రాజకీయ సందేశమా..?
- దానం వ్యాఖ్యలతో కాంగ్రెస్‌లో కొత్త చర్చ



కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణ రాజకీయాల్లో తనదైన శైలిలో మాట్లాడే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మరోసారి రాజకీయ చర్చకు కేంద్రబిందువయ్యారు. తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని స్పష్టం చేస్తూనే... బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ వ్యూహాలను కొనియాడడం, కేటీఆర్-హరీశ్‌రావులను పార్టీకి ప్రధాన బలంగా అభివర్ణించడం అధికార పార్టీలోనే చర్చకు దారితీసింది.

... తరువాయి 2లో

# హరీశ్ బ్రాండ్ పెరుగుతోందా..?

- సిద్దిపేట పాదయాత్ర తర్వాత బీఆర్ఎస్‌లో కొత్త చర్చ
- రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు హరీశ్‌ను రంగంలోకి దించాలని కేడర్ అభిప్రాయం
- కటీఆర్ సంస్థాగత నాయకత్వం... హరీశ్ క్షేత్రస్థాయి రాజకీయాలపై భిన్న చర్చ
- రేవంత్ దూకుడుకు ఎదురుదాడిలో ఎవరిని ముందుంచాలన్నదే అసలు ప్రశ్న
- కేసీఆర్ నిర్ణయంపైనే గులాబీ వ్యూహం ఆధారమనే విశ్లేషణ

2లో





# వ్యూహకర్త కాదు... విజేత..!

కాకతీయ, నేషనల్ డెస్క్ : ఎన్నికల వ్యూహాలతో దేశ రాజకీయాలను ప్రభావితం చేసిన ప్రశాంత్ కిశోర్... ఇప్పుడు ప్రజా తీర్పుతో నాయకుడిగా ముద్ర వేశారు. ఎన్నో ఎన్నికల్లో ఇతర పార్టీల విజయాలకు వ్యూహాలు రచించిన ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త, జన్ సురాజ్ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిశోర్ ప్రత్యక్ష రాజకీయాల్లో తొలి అడుగులోనే విజయఢంకా మోగించారు. బిహార్‌లోని బీజేపీకి కంచుకోటగా పేరొందిన బంకీపూర్ అసెంబ్లీ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థి నీరజ్ కుమార్ సిన్హాపై 19,246 ఓట్ల మెజారిటీతో విజయం సాధించి రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచారు. ఈ విజయంతో వ్యూహకర్తగా మాత్రమే కాదు... ప్రజా నాయకుడిగా కూడా తన రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించారు. బంకీపూర్ నియోజకవర్గం బీజేపీకి దాదాపు మూడు దశాబ్దాలుగా తిరుగులేని కోట. వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్ నబిన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. అధికార పార్టీ మరోసారి విజయంపై ధీమాగా ఉండగా... ప్రశాంత్ కిశోర్ మాత్రం తన ప్రజా పర్యటనలు, ప్రత్యామ్నాయ రాజకీయాల నినాదంతో నేరుగా బరిలోకి దిగారు. చివరకు బీజేపీకి గట్టి షాక్ ఇస్తూ విజయం సాధించారు.

... తరువాయి 2లో

- బీజేపీ కంచుకోటలో ప్రశాంత్ కిశోర్ సంచలనం
- ప్రత్యక్ష రాజకీయాల తొలి పోరులోనే ఘన విజయం
- 19,246 ఓట్ల మెజారిటీతో బంకీపూర్‌ను కైవసం
- ఇతర పార్టీలను గెలిపించిన పీకే... ఇప్పుడు తనకోసమే ప్రజా తీర్పు
- జన్ సురాజ్‌కు తొలి భారీ రాజకీయ బ్రేక్‌త్రూ
- బిహార్ రాజకీయ సమీకరణాల్లో కొత్త అధ్యాయానికి నాంది



# స్థానిక పోరుకు 'సర్' బ్రేక్..!

- ఓటర్ల జాబితా పూర్తయ్యాకే ఎన్నికల నోటిఫికేషన్
- జీహెచ్ఎంసీతో పాటు జడ్పీ, ఎంపీపీ ఎన్నికలకు నిరీక్షణ
- అక్టోబర్‌లో తుది ఓటర్ల జాబితా... ఆ తర్వాతే నిర్ణయం
- మూడు కార్పొరేషన్ల లీగల్ చిక్కులు వీడాల్సిందే
- గ్రామీణ సంస్థల్లో పాలకవర్గాలు లేకపోవడంతో నిధులపై ప్రభావం
- నవంబర్‌కు ముందు ఎన్నికల షెడ్యూల్ కష్టమేనన్న సంకేతాలు

2లో

## కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ టికెట్ల పోరు

- రెండు గ్రాడ్యుయేట్ స్థానాలకు పోటాపోటీ లాబీయింగ్
- గెలుపు గుర్రాల వేటలో హైకమాండ్
- సామాజిక సమీకరణాలపై ముమ్మర కసరత్తు
- రేవంత్-మహేష్ గౌడ్ అభిప్రాయాలకే ప్రాధాన్యం
- ఆశావహుల జాబితాలో కొత్త పేర్లకూ అవకాశం

2లో






# వ్యూహకర్త కాదు... విజేత..!



(మొదటి పేజీ తరువాయి)

## మొదటి రౌండ్ నుంచే ఆధిక్యం

ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలి రౌండ్ నుంచే ప్రశాంత్ కిశోర్ తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. మొదటి రౌండ్‌లోనే 862 ఓట్ల ఆధిక్యం సాధించిన ఆయన... ప్రతి రౌండ్‌తో మెజారిటీని పెంచుకుంటూ వెళ్లారు. మధ్యలో ఎక్కడా ఆధిక్యం కోల్పోకుండా చివరకు 19 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. బీజేపీ బలమైన సంస్థాగత వ్యవస్థ, సంప్రదాయ ఓటు బ్యాంక్ ఉన్న నియోజకవర్గంలో ఈ విజయం సాధించడం రాజకీయంగా మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రశాంత్ కిశోర్ పేరు భారత రాజకీయాల్లో ఎన్నికల వ్యూహాలకు పర్యాయపదంగా మారింది. 2014లో నరేంద్ర మోదీ ఎన్నికల ప్రచారం నుంచి 2015 బిహార్ మహాఘట్‌బంధన్, 2019 ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్సీపీ, 2021 పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, తమిళనాడులో డీఎంకే, ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయాల్లో కీలక పాత్ర పోషించారు. ఆయన స్థాపించిన ఐ–ప్యాక్ ఎన్నికల వ్యూహాలకు కొత్త దిశను చూపింది. అయితే ఇతర పార్టీలకు వ్యూహాలు రచించడం ఒక ఎత్తైతే... ప్రజల ముందుకు స్వయంగా వచ్చి ఓట్లు అడిగి గెలవడం మరో ఎత్తు. ఆ పరీక్షలో కూడా ప్రశాంత్ కిశోర్ విజయవంతమయ్యారు.

## పాదయాత్ర నుంచి పార్టీ నిర్మాణం వరకు

2021 తర్వాత ఎన్నికల వ్యూహకర్తగా కొనసాగకుండా బిహార్ అంతటా సుదీర్ఘ పాదయాత్ర చేపట్టారు. గ్రామాలు, పట్టణాలు చుట్టి ప్రజల సమస్యలను అధ్యయనం చేశారు. ఆ తర్వాత 2024 అక్టోబర్ 2న 'జన్ సురాజ్' పార్టీని స్థాపించి ప్రత్యామ్నాయ రాజకీయాలకు శ్రీకారం చుట్టారు. మొదట్లో పార్టీ ప్రభావంపై అనుమానాలు వ్యక్తమైనప్పటికీ... బంకిపూర్ ఉపఎన్నిక ఫలితం జన్ సురాజ్‌ను రాజకీయ చర్చల్లోకి తీసుకొచ్చింది. బంకిపూర్ విజయం కేవలం ఒక ఉపఎన్నిక ఫలితం మాత్రమే కాదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బీజేపీ, జేడీయూ, ఆర్జేడీ వంటి సంప్రదాయ పార్టీల మధ్య ప్రత్యామ్నాయ రాజకీయ వేదికకు కూడా అవకాశం ఉందనే సంకేతాన్ని ఈ ఫలితం ఇచ్చిందని విశ్లేషిస్తున్నారు. ప్రజల మధ్య సుదీర్ఘంగా పనిచేయడం, డేటా ఆధారిత రాజకీయాలు, క్షేత్రస్థాయి సంస్థాగత నిర్మాణం వంటి అంశాలు ప్రశాంత్ కిశోర్‌కు కలిసి వచ్చినట్లు భావిస్తున్నారు. అయితే ఒక నియోజకవర్గ విజయం రాష్ట్రవ్యాప్తంగా ప్రభావం చూపుతుందా? జన్ సురాజ్ పార్టీ ఈ ఊపును నిలబెట్టుకుంటుందా? రాబోయే బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ శక్తిగా ఎదుగుతుందా? అనే ప్రశ్నలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ ఫలితం మరో విషయాన్ని కూడా స్పష్టం చేసింది. ఎన్నికలు గెలిపించే వ్యూహాలు రచించిన వ్యక్తి... ఇప్పుడు అదే వ్యూహాలతో తన రాజకీయ భవిష్యత్తును కూడా నిర్మించుకోవచ్చని ప్రశాంత్ కిశోర్ నిరూపించారు. బిహార్ రాజకీయాల్లో ఈ విజయం కొత్త సమీకరణాలకు నాంది పలుకుతుందా? లేక ఒక్క ఉపఎన్నిక విజయంగానే మిగిలిపోతుందా? అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

# దానం కామెంట్స్ వెనుక లెక్కలేంటి..?

(మొదటి పేజీ తరువాయి)

ఇదే సమయంలో హైడ్రా, నియోజకవర్గ అభివృద్ధి నిధులపై ప్రభుత్వంపై పరోక్ష అసంతృప్తిని వ్యక్తం చేయడం కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఒక యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన దానం నాగేందర్... "కేసీఆర్ మంచి వ్యూహకర్త. ఫామ్‌హౌస్‌లో ఉన్నా రాజకీయాలను నడిపించగలరు. ఏ అంశాన్నైనా వెంటనే అందిపుచ్చుకునే కేటీఆర్, హరీశ్‌రావులు బీఆర్ఎస్‌కు పెద్ద బలం" అని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలు కాంగ్రెస్ శ్రేణుల్లోనే ఆసక్తికర చర్చకు కారణమయ్యాయి.

## పార్టీ మారినా... రాజకీయ జ్ఞాపకాలు పోలేదా..?

దానం నాగేందర్ రాజకీయ ప్రయాణం ఎన్నో మలుపులు చూసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలిచిన ఆయన... అనంతరం కాంగ్రెస్‌కు చేరువయ్యారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. అప్పటి నుంచి కాంగ్రెస్ నాయకుడిగానే వ్యవహరిస్తున్నారు. అయితే తాజాగా బీఆర్ఎస్ నాయకత్వంపై చేసిన సానుకూల వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త అర్థాలకు తావిస్తున్నాయి. ప్రత్యర్థి పార్టీ అధినేత వ్యూహాలను బహిరంగంగా ప్రశంసించడం సాధారణ రాజకీయ పరిణామం కాదని, ముఖ్యంగా జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ వచ్చిన ఈ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయని పరిశీలకులు అంటున్నారు.

## హైడ్రా... నిధులే అసలు అసంతృప్తి కారణమా..?

దానం నాగేందర్ వ్యాఖ్యల్లో మరో అంశం కూడా రాజకీయంగా ప్రాధాన్యం పొందింది. హైడ్రా చర్యల వల్ల ప్రభుత్వానికి రాజకీయంగా నష్టం జరిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. అంతేకాదు, గత ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్ల వరకు నిధులు వచ్చేవని, ఇప్పుడు అలాంటి పరిస్థితి కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను కొందరు ఎమ్మెల్యే వ్యక్తిగత అసంతృప్తిగా చూస్తుండగా... మరికొందరు అధికార పార్టీలోని స్థానిక నాయకుల భావోద్వేగాలకు ప్రతిబింబంగా విశ్లేషిస్తున్నారు. అన్ని ఊహాగానాలకు తెరదించే ప్రయత్నంలో దానం నాగేందర్ తాను కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి చేస్తానని, పార్టీ కోసం ప్రచారం నిర్వహిస్తానని చెప్పారు. కాంగ్రెస్‌లో ప్రతి ఒక్కరూ నాయకులేనని, పదవుల కోసం ఆశపడాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. అయితే ఆయన చేసిన రాజకీయ విశ్లేషణలు మాత్రం కొత్త చర్చకు దారితీశాయి.

## జీహెచ్ఎంసీ రాజకీయాలపై ప్రభావమా..?

హైదరాబాద్ రాజకీయాలు జీహెచ్ఎంసీ ఎన్నికల దిశగా క్రమంగా వేడెక్కుతున్న వేళ దానం నాగేందర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నగరంలో కాంగ్రెస్ సంస్థాగత బలం పెంచే ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో... సీనియర్ ఎమ్మెల్యే బహిరంగంగా ప్రత్యర్థి పార్టీ నాయకత్వ సామర్థ్యాన్ని ప్రస్తావించడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. దానం వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత అభిప్రాయాలేనా? లేక అధికార పార్టీలోని అంతర్గత అసంతృప్తికి సంకేతమా? జీహెచ్ఎంసీ ఎన్నికల ముందు రాజకీయ సందేశమా? అనే ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ నాయకత్వం ఈ వ్యాఖ్యలను ఎలా పరిగణిస్తుంది... బీఆర్ఎస్ వాటిని రాజకీయంగా ఎలా వినియోగించుకుంటుంది... అన్నది రానున్న రోజుల్లో స్పష్టమయ్యే అవకాశముంది.

# స్థానిక పోరుకు 'సర్' బ్రేక్..!

కాకతీయ, తెలంగాణ బ్యూరో : తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఎదురుచూస్తున్న రాజకీయ పార్టీలకు ప్రభుత్వం కీలక సంకేతాలు ఇచ్చింది. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు గ్రేటర్ వరంగల్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్లు, జిల్లా ప్రజాపరిషత్‌లు, మండల ప్రజాపరిషత్‌ల ఎన్నికలపై ప్రస్తుతం ఎలాంటి తొందరపాటు నిర్ణయం ఉండదని అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) ప్రక్రియ పూర్తై, తుది ఓటర్ల జాబితా విడుదలైన తర్వాతే ఎన్నికల షెడ్యూల్‌పై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎన్నికల కోసం సిద్ధమవుతున్న రాజకీయ పార్టీలకు మరికొంతకాలం నిరీక్షణ తప్పదనే సంకేతాలు వెలువడుతున్నాయి.

## ఓటర్ల జాబితాపైనే ప్రభుత్వ ఫోకస్

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం వేగంగా కొనసాగుతోంది. ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ ఈ నెల 10తో ముగియనుండగా, అభ్యంతరాలు, సవరణల ప్రక్రియ పూర్తయిన అనంతరం అక్టోబర్‌లో తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. అప్పటి వరకు రాష్ట్రంలోని ఏ స్థానిక సంస్థ ఎన్నికలకూ నోటిఫికేషన్ ఇవ్వకుండా ఉండాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపులు, మార్పులు పూర్తయిన తర్వాతే ఎన్నికలకు వెళ్లడం పారదర్శకంగా ఉంటుందని అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

## జీహెచ్ఎంసీ ఎన్నికలకు లీగల్ చిక్కులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యంత ఆసక్తి రేపుతున్న అంశం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలే. పాత జీహెచ్ఎంసీని ప్రభుత్వం జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లుగా విభజించిన తర్వాత ఈ అంశం కోర్టు పరిధిలోకి వెళ్లింది. కొత్త కార్పొరేషన్ల హద్దులు, పరిపాలనా అంశాలపై న్యాయపరమైన వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టు వ్యవహారాలు కొలిక్కి రాకముందు ఎన్నికలకు వెళ్లే అవకాశాలు తక్కువగా ఉన్నాయని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం మూడు కార్పొరేషన్లకు మూడు కమిషనర్లు పరిపాలన నిర్వహిస్తున్నప్పటికీ ప్రజాప్రతినిధుల పాలకవర్గాలు లేకపోవడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

## గ్రామీణ సంస్థలపైనా అదే పరిస్థితి

గ్రామీణ ప్రాంతాల్లోని జిల్లా ప్రజాపరిషత్‌లు, మండల ప్రజాపరిషత్‌ల ఎన్నికలూ ఇదే కారణంతో వాయిదా పడుతున్నాయి. ఎన్నుకోబడిన పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్ర ఆర్థిక సంఘం నిధుల వినియోగం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల అమలుపై ప్రభావం పడుతోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎన్నికలు ఆలస్యం కావడంతో గ్రామీణ రాజకీయాల్లోనూ అనిశ్చితి కొనసాగుతోంది. ఇప్పటికే అనేక మంది ఆశావహులు ప్రచార కార్యక్రమాలకు సిద్ధమవుతుండగా, ఎన్నికల షెడ్యూల్‌పై స్పష్టత లేకపోవడం వారిని నిరీక్షణలో ఉంచుతోంది.

## రాజకీయ లెక్కలు మారే అవకాశం

ఓటర్ల జాబితా తుది రూపు దాల్చిన తర్వాతే ఎన్నికల వ్యూహాలను ఖరారు చేయాలని అన్ని ప్రధాన పార్టీలు భావిస్తున్నాయి. కొత్త ఓటర్ల నమోదు, నియోజకవర్గాల వారీగా ఓటర్ల సంఖ్యలో వచ్చే మార్పులు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో పార్టీలు ప్రస్తుతం బూత్ స్థాయి సమీకరణలపై దృష్టి సారిస్తున్నాయి. అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇటీవల రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా స్పెషల్ సమ్మరీ రివిజన్ పూర్తయ్యే వరకు ఎన్నికలు ఉండబోవని స్పష్టం చేశారు. అక్టోబర్‌లో తుది ఓటర్ల జాబితా విడుదలైన తర్వాతే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంటే నవంబర్‌కు ముందు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు స్వల్పంగానే కనిపిస్తున్నాయి. ప్రస్తుతం అన్ని పార్టీలూ క్షేత్రస్థాయి బలోపేతం, అభ్యర్థుల ఎంపిక, ఓటర్ల సమీకరణపై దృష్టి సారిస్తుండగా... తుది నిర్ణయం మాత్రం ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాతే వెలువడనుంది

# హరీశ్ బ్రాండ్ పెరుగుతోందా..?

- సిద్ధిపేట పాదయాత్ర తర్వాత బీఆర్ఎస్‌లో కొత్త చర్చ
- రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు హరీశ్‌ను రంగంలోకి దించాలని కేడర్ అభిప్రాయం
- కేటీఆర్ సంస్థాగత నాయకత్వం... హరీశ్ క్షేత్రస్థాయి రాజకీయాలపై భిన్న చర్చ
- రేవంత్ దూకుడుకు ఎదురుదాడిలో ఎవరిని ముందుంచాలన్నదే అసలు ప్రశ్న
- కేసీఆర్ నిర్ణయంపైనే గులాబీ వ్యూహం ఆధారమనే విశ్లేషణ



కాకతీయ, తెలంగాణ బ్యూరో : సిద్ధిపేటలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేపట్టిన పాదయాత్ర బీఆర్ఎస్ రాజకీయాల్లో కొత్త చర్చకు దారితీసింది. రైతు సమస్యలు, కాళేశ్వరం నీటి విడుదల అంశాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమం కేవలం జిల్లా రాజకీయాలకే పరిమితం కాలేదు. క్షేత్రస్థాయిలో కనిపించిన స్పందనతో గులాబీ పార్టీలో మరోసారి "ప్రజల్లోకి వెళ్లే రాజకీయాలు" అనే అంశం ముందుకొచ్చింది. ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌కు ఇప్పుడు అవసరం సోషల్ మీడియా ప్రచారమా... లేక పల్లెబాట పట్టే ఉద్యమాలా అన్న చర్చ పార్టీ శ్రేణుల్లోనే వినిపిస్తోంది. ఈ పరిణామాల మధ్య పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారన్న సంకేతాలు వస్తుండగా... మరోవైపు హరీశ్‌రావు పాదయాత్రను రాష్ట్రమంతా విస్తరించాలని కేడర్‌లో అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బీఆర్ఎస్‌లో నాయకత్వంపై కాకుండా... పార్టీ ఉద్యమ ముఖచిత్రం ఎవరై ఉండాలి? అన్న చర్చ ప్రాధాన్యం సంతరించుకుంది.

## సిద్ధిపేటతో మొదలైన చర్చ...

సిద్ధిపేట పాదయాత్రకు రైతులు, కార్యకర్తలు, స్థానిక ప్రజల నుంచి వచ్చిన స్పందనను పార్టీ నాయకత్వం కూడా గమనించినట్లు తెలుస్తోంది. కాళేశ్వరం, సాగునీటి సమస్యలపై హరీశ్‌రావు నేరుగా ప్రజల్లోకి వెళ్లడం కేడర్‌కు ఉత్సాహాన్నిచ్చిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రతిపక్ష రాజకీయాల్లో నిరసనలు, పాదయాత్రలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలే కార్యకర్తల్లో ఉత్సాహాన్ని పెంచుతాయని... అలాంటి కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని ద్వితీయ శ్రేణి నాయకుల్లో చర్చ జరుగుతోందని తెలుస్తోంది. బీఆర్ఎస్‌లో అధికారికంగా కేటీఆర్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్. పార్టీ నిర్వహణ, మీడియా స్పందనలు, జాతీయ రాజకీయాలపై ఆయన ప్రధానంగా దృష్టి పెడుతున్నారు. మరోవైపు హరీశ్‌రావు రైతు సమస్యలు, సాగునీరు, గ్రామీణ తెలంగాణ అంశాలపై నిరంతరం క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నారు. ఈ రెండు శైలులు పరస్పర విరుద్ధమైనవి కావని... కానీ ప్రతిపక్ష రాజకీయాల్లో ప్రజల మధ్య తిరిగే నాయకుడి ప్రభావం కార్యకర్తలపై వేగంగా పడుతుందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అందుకే గ్రామీణ తెలంగాణలో పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే హరీశ్‌రావును మరింత విస్తృతంగా వినియోగించాలన్న అభిప్రాయం కేడర్‌లో వ్యక్తమవుతోందని సమాచారం.

## రేవంత్ దూకుడుకు బీఆర్ఎస్ వ్యూహం మారాల్సిందేనా..?

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడుగా రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరుస పర్యటనలు, సమీక్షలు, పెట్టుబడుల సమావేశాలతో రాజకీయ ఆధిపత్యాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ కూడా కేవలం ప్రెస్‌మీట్లు, సోషల్ మీడియా విమర్శలతో పరిమితం కాకుండా... ప్రజల్లో ప్రత్యక్ష పోరాటాలను పెంచాల్సిందేనన్న అభిప్రాయం పార్టీలో బలపడుతోందని తెలుస్తోంది. సిద్ధిపేట పాదయాత్ర తర్వాత ఈ అభిప్రాయానికి మరింత బలం వచ్చినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. హరీశ్‌రావు పాదయాత్ర తర్వాత వస్తున్న చర్చలను కొందరు నాయకత్వ పోటీగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ... పార్టీకి దగ్గర వర్గాలు మాత్రం దాన్ని ఖండిస్తున్నాయి. కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య అధికారిక విభేదాల కంటే... ఎవరు ఏ బాధ్యతలు చేపడితే పార్టీకి రాజకీయంగా ఎక్కువ ప్రయోజనం ఉంటుందనే కోణంలోనే చర్చ జరుగుతోందని చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం హరీశ్‌రావు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించాలని కార్యకర్తలు కోరుతున్నారన్న విషయం పార్టీ పెద్దల దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

## కేసీఆర్ నిర్ణయమే కీలకం

బీఆర్ఎస్ రాజకీయ వ్యూహంలో చివరి మాట ఇప్పటికీ కేసీఆర్‌దేనని పార్టీ నేతలు చెబుతుంటారు. ప్రతిపక్షంలో పార్టీని ఎలా ముందుకు తీసుకెళ్లాలి? రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలకు నాయకత్వం ఎవరు వహించాలి? కేటీఆర్, హరీశ్‌రావు పాత్రలను ఎలా సమన్వయం చేయాలి? అనే అంశాలపై తుది నిర్ణయం కూడా కేసీఆర్ తీసుకునే అవకాశమే ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం గులాబీ పార్టీలో వినిపిస్తున్న చర్చ ఒకటే... రేవంత్‌రెడ్డి దూకుడును ఎదుర్కోవడానికి బీఆర్ఎస్‌కు కేవలం రాజకీయ విమర్శలు సరిపోతాయా? లేక ప్రజల్లోకి వెళ్లే ఉద్యమాలకు కొత్త రూపకల్పన అవసరమా? సిద్ధిపేట పాదయాత్ర తర్వాత ఆ ప్రశ్న మరింత బలంగా వినిపిస్తోంది.

# కాంగ్రెస్‌లో ఎమ్మెల్సీ టికెట్ల పోరు

కాకతీయ, తెలంగాణ బ్యూరో : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నగారా ఇంకా మోగకముందే కాంగ్రెస్ పార్టీలో టికెట్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి, నల్గొండ–ఖమ్మం–వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను అధికార పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఆశావహులు తమదైన శైలిలో లాబీయింగ్ ముమ్మరం చేశారు. అధికారంలో ఉన్న పార్టీగా ఈ రెండు స్థానాల్లోనూ విజయం సాధించాలన్న లక్ష్యంతో అధిష్ఠానం అడుగులు వేస్తుండగా టికెట్ కోసం సీనియర్లు, యువ నేతలు, వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులు పోటీ పడుతున్నారు.

## గెలుపే కొలమానం... అదే హైకమాండ్ ఫార్ములా

ఈ ఎన్నికల్లో వ్యక్తిగత సీనియారిటీ కంటే గెలిచే సామర్థ్యానికే ప్రాధాన్యం ఇవ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికలు సాధారణ ఎన్నికలకు భిన్నంగా ఉండటంతో అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యావంతుల్లో గుర్తింపు, సంస్థాగత బలం, సామాజిక సమీకరణాలు, స్థానిక రాజకీయ పరిస్థితులు వంటి అంశాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేస్తున్నట్లు సమాచారం. జిల్లాల వారీగా ఫీడ్‌బ్యాక్ సేకరించి... ఆ తర్వాతే అభ్యర్థుల పేర్లను ఖరారు చేయాలన్న దిశగా పార్టీ కసరత్తు ప్రారంభించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మహబూబ్‌నగర్–హైదరాబాద్–రంగారెడ్డి గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి ఆశావహుల సంఖ్య గణనీయంగానే ఉంది. ఉపాధ్యాయ సంఘం నాయకుడు హర్షవర్ధన్ రెడ్డి, పారిశ్రామికవేత్త కుటుంబానికి చెందిన మన్నె జీవన్ రెడ్డి, కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి, టీసాట్ చైర్మన్ శివసేన రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివచరణ్ రెడ్డి, సీనియర్ నేత గౌరీ సతీష్ పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి.

## నల్గొండ-ఖమ్మం-వరంగల్ సీటుపైనా హోరాహోరీ

మరోవైపు నల్గొండ–ఖమ్మం–వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానం కూడా కాంగ్రెస్‌లో తీవ్ర ఆసక్తి రేపుతోంది. ఈ మూడు జిల్లాల్లో పార్టీ బలంగా ఉండటంతో అభ్యర్థి ఎంపికలో ఏ చిన్న పొరపాటు జరిగినా రాజకీయంగా ప్రతికూల ప్రభావం ఉంటుందని పార్టీ అంచనా వేస్తోంది. ఈ స్థానానికి గుత్తా సుఖేందర్ రెడ్డి కుమారుడు అమిత్ రెడ్డి పేరు బలంగా వినిపిస్తున్నప్పటికీ... కోమటిరెడ్డి వర్గం వైఖరి ఎలా ఉంటుందన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో ఓయూ నాయకుడు చనగాని దయాకర్, స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి సింగాపురం ఇందిర పేర్లు కూడా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఖమ్మం, నల్గొండ జిల్లాలకు చెందిన మరికొందరు నాయకులు కూడా టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## సామాజిక సమీకరణాలే కీలకం

రెండు స్థానాల్లోనూ సామాజిక సమీకరణాలకు అధిష్ఠానం పెద్దపీట వేయనున్నట్లు తెలుస్తోంది. ఒక నియోజకవర్గంలో తీసుకునే నిర్ణయం... మరో నియోజకవర్గ అభ్యర్థి ఎంపికపై కూడా ప్రభావం చూపే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. అందుకే రెండు స్థానాలను ఒకే దృష్టితో పరిశీలిస్తూ... సమతుల్య సమీకరణాలతో అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాల అంచనా. టికెట్ కోసం ఆశావహుల ప్రయత్నాలు ఎంత ఉన్నా... తుది నిర్ణయం మాత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అభిప్రాయాల ఆధారంగానే ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. త్వరలో జిల్లాల వారీగా అభిప్రాయ సేకరణ చేపట్టి, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సంస్థాగత నివేదికలను పరిశీలించిన తర్వాతే అభ్యర్థుల పేర్లు ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయి.

# ఆర్టీసీ ఉద్యోగాల ఫలితాలు విడుదల

- 1,743 పోస్టులకు 1,604 మంది అభ్యర్థుల ఎంపిక
- డ్రైవర్ పోస్టులకు 894 మంది.. శ్రామిక్ పోస్టులకు 710 మంది అర్హత
- ఆగస్టు 7 నుంచి అటెస్టేషన్ ప్రక్రియ
- క్యారెక్టర్ వెరిఫికేషన్, వైద్య పరీక్షల తర్వాతే నియామకాలు

కాకతీయ, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు తెలంగాణ పోలీస్ నియామక మండలి శుభవార్త అందించింది. ఆర్టీసీలో డ్రైవర్లు, శ్రామిక్ పోస్టుల భర్తీకి సంబంధించిన తుది ఫలితాలను విడుదల చేసింది. మొత్తం 1,743 పోస్టులకు 1,604 మంది అభ్యర్థులను ఎంపిక చేసింది. తుది ఎంపిక జాబితాలతో పాటు అన్ని కేటగిరీల కట్‌ఆఫ్ మార్కులు, డ్రైవర్ పోస్టులకు సంబంధించిన డ్రైవింగ్ టెస్ట్ మార్కుల షీట్లను అభ్యర్థుల లాగిన్‌లో అందుబాటులో ఉంచింది. 2025 సెప్టెంబర్ 17న విడుదల చేసిన నోటిఫికేషన్ మేరకు ఎంపిక ప్రక్రియ పూర్తి చేసిన బోర్డు, 1,000 డ్రైవర్ పోస్టులకు 894 మందిని, 743 శ్రామిక్ పోస్టులకు 710 మందిని ఎంపిక చేసింది. అయితే క్యారెక్టర్, యాంటీసిడెంట్స్ వెరిఫికేషన్, వైద్య పరీక్షల్లో అర్హత సాధించిన వారికే తుది నియామకాలు ఉంటాయని స్పష్టం చేసింది.

## ఆగస్టు 7 నుంచి అటెస్టేషన్ ప్రక్రియ

ఎంపికైన అభ్యర్థులు ఆగస్టు 7 ఉదయం 8 గంటల నుంచి ఆగస్టు 11 అర్ధరాత్రి వరకు పోలీస్ నియామక మండలి వెబ్‌సైట్‌లో అటెస్టేషన్ ఫారాన్ని ఆన్‌లైన్‌లో నింపాలి. ఫారాన్ని ప్రింట్ తీసుకుని, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అతికించి, సంతకాలు చేసి, గెజిటెడ్ అధికారితో ధ్రువీకరించాలి. మూడు సెట్ల అటెస్టేషన్ ఫారాలతో పాటు సంబంధిత ధ్రువపత్రాల ప్రతులను ఈ నెల 17న సంబంధిత పోలీసు జిల్లా లేదా కమిషనరేట్ కార్యాలయాల్లో సమర్పించాలని బోర్డు సూచించింది.

# సుదర్శన్‌రెడ్డిపై ఒత్తిడి జరిగిందన్నది వాస్తవమే

కాకతీయ, తెలంగాణ బ్యూరో : దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రభుత్వ ఒత్తిడిని ఎదుర్కొన్నారన్నది వాస్తవమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సుదర్శన్‌రెడ్డి సివిల్ సప్లైస్, బంకర్ బెడ్స్ వ్యవహారాల్లో అవకతవకలను ఆధారాలతో బయటపెట్టి అమలు సంస్థలకు ఫిర్యాదు చేశారని తెలిపారు. సుప్రీంకోర్టును కూడా ఆశ్రయించారని, ఆయన మరణించిన మరుసటి రోజే సంబంధిత కేసులో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయని చెప్పారు. బీఆర్ఎస్ నాయకులను వేధించడం ప్రభుత్వానికి అలవాటుగా మారిందని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో కేంద్రంపై నెపం మోపడం సరికాదని కేటీఆర్ విమర్శించారు. విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేస్తున్నారని ఆరోపించారు. గురుకులాల్లో జరిగిన ఘటనలు, ఐటీ రంగంలో ఉద్యోగాల తగ్గుదలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో విద్యా, ఉపాధి రంగాలు వెనుకబడ్డాయని అన్నారు.

## కాళేశ్వరం, మెట్రోపై విమర్శలు

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులు వాస్తవాలను వక్రీకరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. గోదావరిలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మెట్రో ప్రాజెక్టు విషయంలోనూ ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ప్రభుత్వం రాజకీయ ఆరోపణలు చేస్తోందన్నారు.

ఉత్తరం
కాకతీయ
మంగళవారం 04 ఆగస్టు 2026


# నల్లబెల్లిలో పెద్ది విగ్రహానికి భూమిపూజ

## అఖిలపక్షం ఏకగ్రీవ నిర్ణయానికి గ్రామస్థుల మద్దతు



కాకతీయ. నల్లబెల్లి. మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్‌రెడ్డి జ్ఞాపకార్థం నల్లబెల్లి మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి సోమవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. గ్రామపంచాయతీ పాలకవర్గం విగ్రహ ఏర్పాటుకు ఏకగ్రీవంగా తీర్మానం చేయడంతో కార్యక్రమానికి విశేష ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల అనారోగ్యంతో కన్ను మూసిన పెద్ది సుదర్శన్‌రెడ్డి మరణం నర్సంపేట నియోజకవర్గ ప్రజలను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ప్రజలతో మమేకమై సేవలందించిన ఆయన సేవలను చిరస్థాయిగా నిలిపేందుకు అన్ని రాజకీయ పార్టీల నాయకులు, గ్రామ పెద్దలు, అభిమానులు ఒకే వేదికపైకి వచ్చి విగ్రహ ఏర్పాటుకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వెంట నడిచి ఉద్యమ స్ఫూర్తిని చాటిన పెద్ది సుదర్శన్‌రెడ్డి రాష్ట్ర ఏర్పాటు అనంతరం నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని కొనియాడారు. ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్న నాయకుడు ఇక మన మధ్య లేకపోవడం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. విగ్రహ ఏర్పాటుకు అఖిలపక్షం ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకోవడం, గ్రామపంచాయతీ తీర్మానం చేయడం అభినందనీయమని పేర్కొంటూ, సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆశయాలు, ప్రజాసేవా స్ఫూర్తిని అందరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నాగెల్లి జ్యోతి–ప్రకాశ్ రాజారాం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, అభిమానులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని పెద్ది సుదర్శన్‌రెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.

# విద్యుత్ మౌలిక వసతుల ప్రతిపాదనలు సిద్ధం చేయాలి : మంత్రి తుమ్మల

- రూ.3.62 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి శంకుస్థాపన



కాకతీయ, మయూరి సెంటర్ : ఖమ్మం నగర భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం రఘునాథపాలెంలోని ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద రూ.3.62 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రానున్న పదేళ్లలో ఖమ్మం నగరం వేగంగా విస్తరించే అవకాశాలు ఉన్నందున భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదనపు విద్యుత్ ఉపకేంద్రాల ఏర్పాటుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

### 132 కేవీ సబ్‌స్టేషన్‌పై దృష్టి

ఖమ్మం నగరానికి 132 కేవీ విద్యుత్ ఉపకేంద్రం అత్యవసరమని పేర్కొన్న మంత్రి, అందుకు అనువైన ప్రభుత్వ భూమిని గుర్తించి స్థల ఎంపిక, అంచనా వ్యయం, సాంకేతిక ప్రతిపాదనలు సిద్ధం చేసి వెంటనే ప్రభుత్వానికి పంపాలని సూచించారు. భూమి కేటాయింపు పూర్తికాగానే శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభించాలని, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి జిల్లాకు చెందిన వారే కావడంతో అవసరమైన పరిపాలనా, ఆర్థిక అనుమతులు త్వరితగతిన లభించే అవకాశం ఉందన్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా పనులను పర్యవేక్షిస్తూ వివిధ శాఖల అనుమతులు, ఎన్‌ఓసీలు సకాలంలో మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, ఆర్డీఓ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళ ఫిర్యాదుతో రిపోర్టర్‌పై కేసు

## పెళ్లి చేసుకోవాలని వేధింపుల ఆరోపణ

## ఎస్సీ, ఎస్టీ చట్టం కింద కేసు నమోదు

కాకతీయ, మద్దూర్: ఉమ్మడి మద్దూర్ మండల పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా అధికారి ఫిర్యాదు మేరకు బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన రిపోర్టర్ జగ్గం అనిల్‌పై పోలీసులు ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) చట్టం కింద కేసు నమోదు చేశారు. తనను పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఫిర్యాదును పరిశీలించిన పోలీసులు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

# తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



కాకతీయ, మయూరి సెంటర్: ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. పుట్టిన శిశువుకు తొలి 6 నెలలు తల్లిపాలే అందించాలని, ఇతర ఆహారం లేదా పానీయాలు ఇవ్వొద్దని సూచించారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రాధాన్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ పరాస్ కుమార్, డీఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి ఎ. ప్రమీల, డీఎంహెచ్‌వో డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

# పిల్లకు తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

## నీరుకుళ్ల సర్పంచ్ తడాకా నీరజ



కాకతీయ,ఆత్మకూరు : తల్లి పాలతోనే పిల్లలు ఆరోగ్యాంగా ఉంటారని నీరుకుళ్ల సర్పంచ్ తడాకా నీరజ తెలిపారు.సోమవారం ఆత్మకూరు మండలం నీరుకుళ్ల, కటాక్షపూర్, తిరుమలగిరి, గ్రామాల్లో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నీరుకుళ్ల సర్పంచ్ తడాకా నీరజ మాట్లాడుతూ అప్పుడే పుట్టిన శిశువుకు ఆరునెలలు వచ్చేంత వరకు కచ్చితంగా తల్లపాలు పట్టించాలని అన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు, పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సూచించారు. అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నీరుకుళ్ల సర్పంచ్ తడాకా నీరజ,సర్పంచ్ షబానా గాపుర్,తిరుపతి, పంచాయతీ కార్యదర్శి సాయిప్రియ, అంగన్వాడీ టీచర్లు షమీమా, పద్మ, మణెమ్మ, బుజ్జమ్మ, అరుణ, రమాదేవి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

# కేజీ కేఎస్ ఆధ్వర్యంలో గీతన్నల చైతన్య యాత్ర



## ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలి

## కేజీ కేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంవి రమణ

కాకతీయ, నెల్లికుదురు: ప్రభుత్వం గౌడ్ అన్నలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం వి రమణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఇనుగుర్తి, నెల్లికుదురు మండలాలలో అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రలో భాగంగా శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలవేసి అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక సంఘానికి పోరాటం చేసిన అమరుడు పెరుమాండ్ల జగన్నాథం కుమారుడు అయిన పెరుమాండ్ల తిలక్ బాబును శాలువాతో ఘనంగా సత్కరించి సత్కరించి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గౌడ కులస్తులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో గీతా కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రణాళికలు ప్రకటించిన విధంగా పెన్షన్ 4000 రూపాయలు ఎక్స్గ్రేషన్ 10 లక్షలు పెంచి పెండింగ్లో ఉన్న ఎక్సిబిషన్ డబ్బులు 20 కోట్ల రూపాయలను వెంటనే సంబంధిత బాధితులకు అందజేయాలని మృతి చేసే వారందరికీ కాటమయ్య రక్షణ కవచాలు ఇవ్వాలని ప్రభుత్వ జీవో ప్రకారం 50 సంవత్సరాల పైబడిన గీతా కార్మికులందరికీ పెన్షన్లు వెంటనే అందజేయాలని అన్నారు చైతన్య యాత్ర రెండవ తేదీన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభమై 18వ తేదీ వరకు హైదరాబాదులోని ట్యాంక్ బండ్ హైదరాబాదుకు చేరుకుంటారని తెలిపారు. గీతా కార్మికుల హక్కుల పరిష్కారం కోసం పోరాటాలు తప్పవని అన్నారు. గీతా కార్మికులంతా ఐక్యత నుండి హక్కు ల కోసం పోరాడల్సిన అవసరం ఉందని అన్నారు . ఈనెల 18వ తేదీ లోపు ప్రభుత్వం అధికారికంగా సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండపై ఏర్పాటు చేయకపోతే అదే రోజు వేలాది గౌడ సంఘం కులస్తులతో కలిసి విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీ కేస్ జిల్లా అధ్యక్షుడు గౌని వెంకన్న ప్రధాన కార్యదర్శి యమ గాని వెంకన్న మండల కేజీ కేఎస్ అధ్యక్షుడు విరగాని మల్లేశం గౌడ్, ప్రధాన కార్యదర్శి శీలం సత్యనారాయణ, సాంబయ్య, సమ్మె గౌడ్, సుధాకర్, చంద్రమౌళి, వెంకన్న, రాజు, లక్ష్మణ్, యాకయ్య, సమ్మయ్య, లింగమూర్తి, శంకర్, యుగేందర్, వెంకటరాములు, రాము వివిధ గ్రామాల కల్లుగీత కార్మిక సంఘం నాయకులు సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాల, యంగ్ ఇండియా స్కూల్ పనులు వేగవంతం చేయాలి

## డిసెంబర్ నాటికి వైద్య కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి

## వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

కాకతీయ, మయూరి సెంటర్ : ప్రభుత్వ వైద్య కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం రఘునాథపాలెంలోని నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌తో కలిసి ఆయన పరిశీలించారు. వైద్య కళాశాల పనులను దశలవారీగా పూర్తి చేసి, ఖమ్మంలో ముఖ్యమంత్రి పర్యటనకు ముందే ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. ప్రహరీ గోడ, అంతర్గత రహదారులు, హాస్టళ్లు, విద్యుత్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. బాలికల హాస్టల్‌ను సెప్టెంబర్ 1 నాటికి, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌ను అక్టోబర్‌లో, అన్ని నిర్మాణాలను డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

### యంగ్ ఇండియా స్కూల్‌పై ప్రత్యేక దృష్టి

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో 17 బ్లాకులు, పేరెంట్స్ లాంజ్, కిచెన్, డైనింగ్ హాల్, హాస్టళ్లు, అకడమిక్ బ్లాకులు, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక సదుపాయాల పనులను నాణ్యతతో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి నిర్మాణం పూర్తిచేసి సంబంధిత శాఖకు అప్పగించి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పరిశీలనలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసచారి, ఆర్డీఓ శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు,వైద్యశాఖఅధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పనులు వేగవంతం చేయాలి : మంత్రి శ్రీధర్ బాబు

### చెక్‌డ్యాం ఆధునికీకరణకు భూమిపూజ.. కోకాకోలా పరిశ్రమ స్థల పరిశీలన

కాకతీయ, మల్హర్–మంథని: మంథని పట్టణంలో చేపడుతున్న ప్రభుత్వ నిర్మాణ పనులను నాణ్యతతో, గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత ఆర్డీవో కార్యాలయం, 50 పడకల ప్రభుత్వ ఆస్పత్రి, నూతన మున్సిపల్ కార్యాలయం నిర్మాణాలను పరిశీలించారు. అనంతరం రూ.2 కోట్లతో చేపడుతున్న బొక్కలవాగు చెక్‌డ్యాం ఆధునికీకరణ, సుందరీకరణ పనులకు భూమిపూజ చేశారు. తర్వాత రామగిరి మండలం రత్నాపూర్ శివారులో ప్రతిపాదిత కోకాకోలా పరిశ్రమ కోసం గుర్తించిన 250 ఎకరాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పరిశ్రమ ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి తెలిపారు.

# ఆటో డ్రైవర్లకు సీఐ విశ్వేశ్వర్ కౌన్సెలింగ్

కాకతీయ, గీసుగొండ : ఆటో అడ్డా వివాదంపై ఆటో డ్రైవర్లకు సీఐ డీ. విశ్వేశ్వర్ కౌన్సెలింగ్ నిర్వహించారు. మండలంలోని మచ్చాపూర్ గ్రామ ఆటో అడ్డా వినియోగానికి సంబంధించి మచ్చాపూర్,ఎలుకుర్తి, అరెపల్లి గ్రామాల ఆటో డ్రైవర్ల మధ్య నెలకొన్న వివాదం నేపథ్యంలో గీసుగొండ పోలీసులు, ప్రాంతీయ రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులతో కలిసి ఇరు గ్రామాల ఆటో యూనియన్ ప్రతినిధులు, ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ అనుమతితో ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్లను మాత్రమే వినియోగించా లని,ప్రతి ఆటో డ్రైవర్ వాహనానికి సంబంధించిన అన్ని చెల్లుబాటు అయ్యే పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. మోటారు వాహన చట్టంలోని నిబంధనలు, అధికారుల ఆదేశాలను ప్రతి ఒక్కరూ పాటించాలని వివరించారు.ఎవరైనా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ఇతర ఆటో డ్రైవర్లను అడ్డుకోవడం, బెదిరించడం లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని సీఐ డి.విశ్వేశ్వర్ హెచ్చరించారు.

# జంపన్న వాగుపై వంతెన నిర్మించాలి

## జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం

కాకతీయ, ఏటూరునాగారం: ఏటూరునాగారం మండలం అల్లవారి గణపురం గ్రామపంచాయతీ పరిధిలోని ఎలిశెట్టిపల్లి గిరిజన గ్రామానికి జంపన్న వాగుపై శాశ్వత వంతెన నిర్మించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడు వినుకోలు చక్రవర్తితో కలిసి గ్రామాన్ని సందర్శించిన ఆయన, వంతెన లేక ప్రతి వర్షాకాలంలో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రామంలో రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం కొనసాగిస్తే గిరిజనులతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

# అక్రమంగా తరలిస్తున్న టేకు కలప స్వాధీనం

- రూ.4 లక్షల విలువైన 11 టేకు దిమ్మలు, బొలెరో వాహనం పట్టివేత
- ఇద్దరు పరారీ.. అక్రమ రవాణా ముఠాపై దర్యాప్తు ప్రారంభం



కాకతీయ, ఏటూరునాగారం : నూగూరు–వెంకటాపురం మండలంలో అక్రమంగా తరలిస్తున్న విలువైన టేకు కలపను అటవీ శాఖ అధికారులు చాకచక్యంగా స్వాధీనం చేసుకున్నారు. చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వెంకటాపురం వైపు అనుమానాస్పదంగా వస్తున్న బొలెరో వాహనాన్ని రామచంద్రాపురం గ్రామ శివారులో గస్తీ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది గుర్తించి అడ్డగట్టి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో వాహనంలో ఎలాంటి చట్టబద్ధమైన అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న 11 టేకు దిమ్మలు బయటపడగా, వాటి విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. టేకు కలపతో పాటు రవాణాకు ఉపయోగిస్తున్న బొలెరో వాహనాన్ని కూడా అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

### పరారీలో నిందితులు.. విచారణ ముమ్మరం

అటవీ సిబ్బంది తనిఖీలు చేపట్టిన సమయంలో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తి వాహనాన్ని వదిలి పరారైనట్లు సమాచారం. నిందితుల కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నట్లు తెలిసింది. చత్తీస్‌గఢ్ నుంచి టేకు కలపను అక్రమంగా తరలిస్తున్న ముఠాపై అటవీ శాఖ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. కలపను ఎక్కడి నుంచి తీసుకొచ్చారు, ఎక్కడికి తరలిస్తున్నారు, ఈ వ్యవహారం వెనుక ఎవరున్నారు అనే అంశాలపై విచారణ కొనసాగుతోంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.

# లక్ష్యం మిస్ అయితే కారణాలు చెప్పాల్సిందే

- వనమహోత్సవం 28 శాతం మాత్రమే పూర్తి
- మిగిలిన 72 శాతం వెంటనే పూర్తి చేయాలి
- జియో ట్యాగింగ్, మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలి
- వరంగల్ కలెక్టర్ సత్య శారద



కాకతీయ, వరంగల్ ప్రతినిధి : వనమహోత్సవం–2026 లక్ష్యాలను ఎలాంటి సాకులు లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఎఫ్ఓ నిఖిల్‌తో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ (డీఎల్ఎంసీ) సమావేశంలో శాఖల వారీగా మొక్కల నాటకం పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాకు ఈ ఏడాది 25.51 లక్షల మొక్కలు నాటే లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 7,27,612 మొక్కలు మాత్రమే నాటడం జరిగిందని, అంటే 28 శాతం మాత్రమే లక్ష్యం పూర్తైందని తెలిపారు. మిగిలిన 72 శాతం లక్ష్యాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, వెనుకబడిన శాఖల అధికారులు కారణాలు వివరించాలని స్పష్టం చేశారు. నాటిన ప్రతి మొక్కకు తప్పనిసరిగా జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని, మొక్కల మనుగడను నిర్ధారించేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వర్షాకాలాన్ని సద్వినియోగం చేసుకుని రోజువారీ కార్యాచరణతో లక్ష్యాలను పూర్తి చేసి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని సూచించారు. అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీఓ నాగపద్మజతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఆగస్టు 10 జైల్ భరోను విజయవంతం చేయాలి

- క్విట్ ఇండియా స్ఫూర్తితో దేశవ్యాప్త ఉద్యమం
- సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు



కాకతీయ, ఏటూరునాగారం: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 10న నిర్వహించే దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. నాగయ్య, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. ఏటూరునాగారంలో జరిగిన జిల్లా సదస్సులో వారు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లు, ఉపాధి హామీ, విద్యుత్ చట్ట సవరణలు, రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో బిరెడ్డి సాంబశివ, రత్నం రాజేందర్, ఎం.డి. దావూద్, ఆర్. నీలాదేవి, సమ్మక్కతో పాటు సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై యువతకు అవగాహన కల్పించాలి

- డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి సమిష్టి కృషి అవసరం
- అదనపు కలెక్టర్ సి.హెచ్. మహేందర్

కాకతీయ, ములుగు ప్రతినిధి: మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సి.హెచ్. మహేందర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు, డ్రగ్స్ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల పరిసరాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మత్తు పదార్థాలపై సమాచారం ఉంటే 1908 టోల్‌ఫ్రీ నంబర్ లేదా 8712671111 కంట్రోల్‌రూమ్‌కు తెలియజేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, ఆర్డీవో కృష్ణవేణి, నార్కోటిక్ డీఎస్పీ రమేష్, ఎస్‌డీటీ ప్రతాప్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచొద్దు

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న
- గడువులోగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా నిర్దేశిత గడువులో పరిష్కరించాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 98 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. బోనాలు, బతుకమ్మ పండుగల నేపథ్యంలో ఇంజినీరింగ్ పనులకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని, టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. రెవెన్యూ అధికారులు ఆస్తి పన్ను వసూళ్లు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రజావాణిలో టౌన్ ప్లానింగ్ 39, ఇంజినీరింగ్ 31, హెల్త్ అండ్ శానిటేషన్ 11, రెవెన్యూ 9, నీటి సరఫరా 8 దరఖాస్తులు అందాయి. సమావేశంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ రాజ్‌కుమార్, డీఎఫ్ఓ శంకర్ లింగం తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ టోల్ వసూళ్లపై మౌన దీక్ష

- సమాధానం వచ్చే వరకు దీక్ష విరమించబోనన్న ఎస్‌పీకే సాగర్
- రాజ్యాంగ నిబంధనలు అమలు చేయాలని డిమాండ్



కాకతీయ, ములుగు ప్రతినిధి : అక్రమ టోల్ వసూళ్లను నిలిపివేసి, రాజ్యాంగ నిబంధనలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ది నేషనల్ కన్స్యూమర్ హెడ్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర చైర్మన్, సామాజిక కార్యకర్త ఎస్‌పీకే సాగర్ సోమవారం ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మౌన పోరాట దీక్ష చేపట్టారు. జిల్లాలో చట్టబద్ధత లేని టోల్ వసూళ్లు కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ, దీనిపై జిల్లా యంత్రాంగం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పీకే సాగర్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్–265 ప్రకారం చట్టబద్ధమైన అధికారం లేకుండా ఎలాంటి పన్ను లేదా రుసుము వసూలు చేయరాదన్నారు. సుప్రీంకోర్టుతో పాటు పలు హైకోర్టులు కూడా సేవలు అందించని సంస్థలు టోల్ వసూలు చేయడానికి హక్కు లేదని స్పష్టం చేశాయని గుర్తు చేశారు. జోహార్‌నగర్–పస్రా మార్గంలో ఫాస్టాగ్ ఖాతా నుంచి టోల్ రుసుము కట్ అయిన విషయాన్ని గతంలోనే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశానని తెలిపారు. నేషనల్ హైవే నిబంధనలకు విరుద్ధంగా తక్కువ దూరంలోనే మరో టోల్ వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఆర్టీఐ ద్వారా సమాచారం కోరినా పూర్తి వివరాలు ఇవ్వలేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్ స్వయంగా స్పందించి తమ ప్రశ్నలకు సమాధానం చెప్పే వరకు దీక్షను విరమించబోనని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే విచారణ జరిపి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఎప్పుడు తెరుస్తారో... ఎప్పుడు మూస్తారో..!

- పెద్దవంగరలో అస్తవ్యస్తంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ
- పౌష్టికాహారానికి దూరమవుతున్న గర్భిణులు, చిన్నారులు



కాకతీయ, పెద్దవంగర : గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ పెద్దవంగర మండలంలో ప్రశ్నార్థకంగా మారింది. కేంద్రాలు ఎప్పుడు తెరుస్తారో, ఎప్పుడు మూసేస్తారో తెలియని పరిస్థితి నెలకొనడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని బొమ్మకల్ గ్రామం రెండో అంగన్‌వాడీ కేంద్రానికి తరచూ తాళం వేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందాల్సిన పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ కావడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నాణ్యతపై కూడా విమర్శలు**

కొన్ని కేంద్రాలు తెరిచినా పంపిణీ చేస్తున్న గుడ్లు నాణ్యత లేనివిగా, చిన్న పరిమాణంలో ఉన్నాయని లబ్ధిదారులు చెబుతున్నారు. దీనిపై ప్రశ్నిస్తే "మాకు వచ్చినవే ఇవి" అంటూ సిబ్బంది సమాధానం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. గుడ్ల సరఫరాలో కూడా పర్యవేక్షణ లోపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై సీడీపీఓ రేష్మను వివరణ కోరగా, బొమ్మకల్ రెండో అంగన్‌వాడీ కేంద్రంలో కొన్ని సమస్యలు ఉన్నాయని అంగీకరించారు. సంబంధిత సిబ్బంది పనితీరు మెరుగుపడకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని, విధులు సక్రమంగా నిర్వహించని అంగన్‌వాడీ సిబ్బందికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు.

## తాడిచెర్ల డేంజర్ జోన్ సమస్య పరిష్కారానికి మంత్రి చొరవ



- పదేళ్ల ప్రజల డిమాండ్ నెరవేరుతోందన్న భూనిర్వాసితుల కమిటీ
- కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ

కాకతీయ, మల్హర్ : తాడిచెర్ల జెన్‌కో డేంజర్ జోన్‌లో నివసిస్తున్న ప్రజల చిరకాల సమస్య పరిష్కారానికి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ చూపారని భూనిర్వాసితుల కమిటీ అధ్యక్షుడు, ఈజీసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండు రమేష్ అన్నారు. సోమవారం మల్హర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2017లో జెన్‌కో ఉపరితల బొగ్గుగని ప్రారంభ సమయంలో డేంజర్ జోన్ పరిధిలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని హామీ ఇచ్చి, అనంతరం వారి సమస్యలను నిర్లక్ష్యం చేశారని అన్నారు. దీంతో గత పదేళ్లుగా బాధితులు ధర్నాలు, నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. 2022లో డేంజర్ జోన్ ఇళ్లపై ప్రాథమిక నోటిఫికేషన్ జారీ అయినప్పటికీ అప్పటి ప్రభుత్వం సమస్యను పరిష్కరించలేదని విమర్శించారు.

**మంత్రి చొరవతో సర్వే ప్రారంభం**

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు మంత్రి శ్రీధర్ బాబు ఈ అంశాన్ని ప్రత్యేకంగా తీసుకుని జెన్‌కో ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారని దండు రమేష్ తెలిపారు. అనంతరం జెన్‌కో సంస్థ రూ.261 కోట్లకు పైగా నిధులను జిల్లా కలెక్టర్ ఖాతాలో జమ చేయడంతో జూలై 17 నుంచి అధికారిక సర్వే ప్రారంభమైందన్నారు. ఈ ప్రక్రియ కొనసాగుతున్న సమయంలో కొందరు వ్యక్తులు తమ కోర్టు కేసుల వల్లే నిధులు విడుదలయ్యాయని, సర్వే జరుగుతోందని ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు అనవసరంగా తామే కారణమన్న ప్రచారం చేయడం సరి కాదని అన్నారు. విలేకరుల సమావేశంలో తాడిచెర్ల గ్రామ సర్పంచ్ బండి స్వామి, ఉపసర్పంచ్ బొబ్బిలి రాజుగౌడ్, భూనిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.

## వరుస బైక్ చోరీలకు చెక్

- ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్
- రూ.25 లక్షల విలువైన 28 ద్విచక్ర వాహనాల స్వాధీనం



కాకతీయ, వరంగల్ బ్యూరో : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల చోరీలకు పోలీసులు చెక్ పెట్టారు. వరంగల్ సీసీఎస్, కేయూసీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఇద్దరు అంతర్రాష్ట్ర బైక్ దొంగలను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి సుమారు రూ.25 లక్షల విలువైన 28 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్ కమిషనర్ తెలిపిన వివరాల ప్రకారం, వరుస బైక్ చోరీల నేపథ్యంలో సెంట్రల్ జోన్ డీసీపీ కవిత ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలు, సీసీటీవీ ఫుటేజీలతో దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో దొంతుల ప్రశాంత్ కుమార్, దుర్గం సాయికుమార్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, తెలంగాణలోని పలు జిల్లాల్లో బైక్ చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. వారి సూచన మేరకు మునిపల్లి గ్రామ శివారు, ఎలుకతుర్తి సమీపంలో దాచిన 28 బైకులను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో వరంగల్, కరీంనగర్, రామగుండం, సిద్దిపేట, హైదరాబాద్, రాచకొండ కమిషనరేట్లతో పాటు భూపాలపల్లి జిల్లాకు చెందిన వాహనాలు ఉన్నాయి. స్వాధీనం చేసుకున్న బైకులను చట్టపరమైన ప్రక్రియ అనంతరం యజమానులకు అప్పగించనున్నట్లు పోలీసులు తెలిపారు. కేసును ఛేదించిన సీసీఎస్, కేయూసీ పోలీసు బృందాన్ని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## పేద విద్యార్థులకు అండగా రోటరీ క్లబ్

**ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగుల పంపిణీ**

**విద్యాభివృద్ధికి సేవా సంస్థల సహకారం అభినందనీయం: సర్పంచ్ సయ్యద్ మౌల**



కాకతీయ, ఆత్మకూరు : పేద విద్యార్థులకు మెరుగైన విద్య అందించడంలో సేవా సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని హౌస్ బూజుర్గ్ గ్రామ సర్పంచ్ సయ్యద్ మౌల అన్నారు. సోమవారం ఆత్మకూరు మండలం హౌస్ బూజుర్గ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తూ రోటరీ క్లబ్ సామాజిక బాధ్యతను చాటుకుంటోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చదువులో ప్రతిభ కనబర్చాలని సూచించారు. భవిష్యత్తులో కూడా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయురాలు అనురాధ, రోటరీ క్లబ్ సభ్యులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ మార్కెట్లకు నూతన శోభ

- ప్రత్యేక నిధులతో మౌలిక వసతుల కల్పన
- అన్నదాత అభివృద్ధికి నిరంతరం కృషి
- కొడకండ్ల, తొర్రూరు మార్కెట్ యార్డులకు రూ.3.35 కోట్లు
- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



కాకతీయ,రాయపర్తి : రాష్ట్ర ప్రభుత్వం నుండి ప్రత్యేక నిధులను సమీకరించి నియోజకవర్గంలోని వ్యవసాయ మార్కెట్లను మోడల్ యార్డులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు వేగవంతమయ్యాయి.పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పలుమార్లు భేటీ అయి వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేయగా సోమవారం ఆయన సానుకూలంగా స్పందించారు.ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో మార్కెట్లలో మౌలిక వసతులు కల్పనకు నిధులు మంజూరు కావడంతో,ఏళ్ళ తరబడి సమస్యలతో సాగుతున్న మార్కెట్లకు ఇప్పుడు నూతన శోభ సంతరించుకోనుంది.ఈ క్రమంలో కొడకండ్ల,తొర్రూరు మండలాల వ్యవసాయ మార్కెట్ యార్డుల ఆధునీకరణ,మౌలిక వసతుల కల్పన కోసం రూ.3.35 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.ఇందులో భాగంగా కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ యార్డుకు రూ.2.43 కోట్లు మంజూరవగా.. మార్కెట్లో భారీ కవర్ షెడ్ నిర్మాణం,మూత్రశాలలు,ఆర్ఓ ప్లాంట్ తో కూడిన గది,దేవరుప్పుల సబ్ మార్కెట్ యార్డులో నాబార్డ్ గోదాం చుట్టూ ప్రహరి గూడా నిర్మించనున్నారు.అలాగే తొర్రూరు వ్యవసాయ మార్కెట్ యార్డుకు రూ.92 లక్షల నిధులు మంజూరయ్యాయి. మార్కెట్ యార్డు ప్రధాన ద్వారం నుండి గోదాం వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టానున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతాంగానికి మేలు చేయడమే రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని అన్నారు.నియోజకవర్గానికి అడిగిన వెంటనే రూ.3.35 కోట్ల నిధులు కేటాయించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.దింతో మార్కెట్ యార్డుల్లో మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## చెట్లు పెంపకంతో ఎల్ ని నోను అధిగమిద్దాం




మొక్కలు నాటిన తులసి సేవాసొసైటీ

కాకతీయ,నెల్లికుదురు: భవిష్యత్తులో వచ్చే ఎల్ ని నో రాకుండా ఉండాలంటే చెట్ల పెంపకతోనే సాధ్యమని తులసి సేవ సొసైటీ వ్యవస్థాపకులు బొల్లంపల్లి విజేందర్,పంజాల దేవరాజు గౌడ్లు అన్నారు.పర్యావరణం పరిరక్షణలో భాగంగా తులసి సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలం లోని రాజుల కొత్తపల్లి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద సోమవారం మొక్కలు నాటారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటడం చెట్లను పరిరక్షించడంలో నిర్లక్ష్యం మూలంగానే ఎల్ నీనో వంటి వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఈ సమస్య మనం ప్రస్తుతం ప్రత్యక్షంగా అనుభవిస్తున్నామని అందుకే ఒక్కో ఇంటి ఆవరణంలో రెండు మొక్కలు చొప్పున మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టాలన్నారు. చెట్ల పెంపకం తోనే జీవుల మనుగడకు బాటలు వేసిన వారమవుతామన్నారు. చెట్లు వాయు కాలుష్యాన్ని తగ్గించి ప్రాణవాయువును అందిస్తాయన్నారు. ఇదే తరహాలో గోవులను సైతం ఇంటింటా పోషించినట్లయితే ఆరోగ్యంతో పాటు, వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకం 001......తగ్గి ఆర్గానిక్ సాగు క్రమేనా పెరుగుతూ వచ్చే పంటల ద్వారా మానవాళి సంపూర్ణ ఆరోగ్యం వైపు అడుగులు వేస్తుందన్నారు. కార్యక్రమాలలో తులసి సేవా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఏలేటి మంగారెడ్డి,బిజెపి సీనియర్ నాయకులు వంగాల రామచంద్రు,మోడెం నరసయ్య గౌడ్, గ్రామస్తులు బొల్లంపల్లివెంకన్న,బొల్లంపల్లి సునీల్, అయిత బిక్షం దర్శనపు ఉప్పలయ్య మల్లయ్య మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలి

**పెండింగ్‌కు తావివ్వొద్దని అధికారులకు ఆదేశం**

**జిల్లా కలెక్టర్ డా. సత్య శారద**



కాకతీయ, వరంగల్ ప్రతినిధి: ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును నిర్దేశిత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 153 వినతులు స్వీకరించి సంబంధిత శాఖలకు పంపించారు. రెవెన్యూ 41, జీడబ్ల్యూఎంసీ 30, హౌసింగ్ 20, ఇతర శాఖలు 62 దరఖాస్తులు అందాయి. నిరుద్యోగుల కోసం కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్లో టైలరింగ్ నైపుణ్యం ఉన్న వారికి ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టి, పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు జి. సంధ్యారాణి, వై.వి. గణేష్, జడ్పీ సీఈఓ రామ్‌రెడ్డి, డీఆర్వో విజయలక్ష్మి, డీఆర్‌డీఓ నాగ పద్మజ, డీఎంహెచ్‌వో డా. రాజారెడ్డి పాల్గొన్నారు.

## పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలి



కాకతీయ, నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడులో సోమవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బొల్లికొండ చైతన్య నాగరాజు మాట్లాడుతూ పుట్టిన గంటలోపే శిశువులకు ముర్రుపాలు పట్టించాలని, 6 నెలల వరకు తల్లిపాలే అందించాలని సూచించారు. కార్యక్రమంలో తల్లిపాల ప్రాధాన్యం, పోషకాహారంపై అవగాహన కల్పించి గర్భిణీలు, తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. అక్షరాభ్యాసం, శ్రీమంతం కార్యక్రమాలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ సరిత, ఏడబ్ల్యూటీలు వీరలక్ష్మి, జమలబీ, వెంకటమ్మ, మహతి, సరోజినీ, ఏడబ్ల్యూహెచ్ ధనమ్మ, లక్ష్మి, ఆశ వర్కర్లు, గర్భిణీలు, తల్లులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- పాఠశాలల్లో ఆరోగ్య శిబిరాలు
- విద్యార్థులకు వైద్య పరీక్షలు



కాకతీయ, ఆత్మకూరు : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ పుష్పలీల సూచించారు. సోమవారం ఆత్మకూరు మండలంలోని పలు ప్రాథమిక పాఠశాలల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. వర్షాకాలంలో పరిశుభ్రత పాటిస్తూ అనారోగ్యానికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు అలవాటు పడవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీడీఎంఓ సాంబయ్య, ఏఎన్ఎంలు సునీత, ఆశ కార్యకర్తలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బతికుండగా భారమై... చనిపోయాక ఆస్తై..!

- 90 ఏళ్ల వృద్ధురాలి జీవితాంతం కన్నీటి గాథ
- పోషణ కోసం ఉంచుకున్న 8 ఎకరాల భూమిపైనే కన్ను
- నాయనమ్మను పట్టించుకోలేదనే మనవడిపై గ్రామంలో ఆరోపణలు
- భూముల బదిలీ వ్యవహారంపై విచారణకు స్థానికుల డిమాండ్



కాకతీయ,కొత్తగూడెం/ జూలూరుపాడు : ఒకప్పుడు కుటుంబం కోసం కష్టపడి ఆస్తులు కూడబెట్టిన పెద్దలు.. వృద్ధాప్యంలో అదే ఇంట్లో పరాయివారిగా మారిపోతున్న విషాద ఘటనలు పెరుగుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలో వెలుగుచూసిన ఓ ఘటన స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. బతికున్నప్పుడు ఆదరణ దక్కని ఓ వృద్ధురాలి చుట్టూ ఇప్పుడు ఆస్తి వివాదం నెలకొనడం మానవ సంబంధాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇటీవల మృతి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు తన కుమారుడికి గతంలోనే సుమారు 25 ఎకరాల భూమిని ఇచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వృద్ధాప్యంలో తన పోషణ కోసం మిగిలిన సుమారు 8 ఎకరాల భూమిని తన పేరునే ఉంచుకున్నట్లు సమాచారం. అయితే, ఆ భూమిని దశాబ్దం క్రితమే ఆమెకు తెలియకుండా తన పేరుకు మార్చించుకున్నాడనే ఆరోపణలు ఆమె మనవడిపై వినిపిస్తున్నాయి. అప్పటి రెవెన్యూ అధికారుల సహకారంతో ఈ ప్రక్రియ జరిగిందనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

**బతికున్నప్పుడు ఆదరణే కరువు**

గ్రామస్తుల కథనం ప్రకారం, వృద్ధురాలు జీవించి ఉన్న సమయంలో ఆమెకు తగిన సంరక్షణ లభించలేదని చెబుతున్నారు. చివరి రోజుల్లో అనారోగ్యంతో ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నప్పటికీ కుటుంబ సభ్యులు పరామర్శించలేదని ఆరోపిస్తున్నారు. ఇంటి నుంచి వెళ్లిపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, మరణానంతరం అంత్యక్రియల బాధ్యతలు కూడా సక్రమంగా నిర్వర్తించలేదని స్థానికులు వాపోతున్నారు. గ్రామంలో వినిపిస్తున్న ఆరోపణల ప్రకా రం, అదే కుటుంబానికి చెందిన వృద్ధురాలి కుమారుడికీ చివరి రోజుల్లో తగిన ఆదరణ లభించలేదని చెబుతున్నారు. ఆసుపత్రిలో మరణించిన అనంతరం కూడా మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు కుటుంబ సభ్యులు ముందుకు రాలేదని స్థానికులు పేర్కొంటున్నా రు. ఈ ఘటనలు గ్రామంలోచర్చనీయాంశంగామారాయి. ఆస్తి విషయంలో తలెత్తిన వివాదం, భూముల బదిలీపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పూర్తి స్థాయి విచారణ జరిపించాలని గ్రామస్తులు కోరుతున్నారు. వృద్ధుల హక్కులు, వారి ఆస్తుల రక్షణ విషయంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. బతికున్నప్పుడు ఆదరించని బంధాలు.. మరణానంతరం ఆస్తి కోసం పోటీ పడటం సమాజంలో మానవ విలువలు ఎంతగా క్షీణించాయో ఈ ఘటన మరోసారి గుర్తుచేస్తోందనిస్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## 5 నెలలుగా వేతనాలు బంద్

- ఎంపీడీవో కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ల ఆవేదన
- ఇందిరమ్మ ఇండ్ల పనులపై ప్రభావం

కాకతీయ, కారేపల్లి: కారేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లకు 5 నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేతనాల జాప్యంతో ప్రభుత్వ సేవల నిర్వహణపై ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఫోటోలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడంలో జాప్యం ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. దీంతో తదుపరి విడత నిధుల విడుదల, అంచనా ప్రక్రియ కూడా ఆలస్యమయ్యే పరిస్థితి ఉందని సంబంధిత వర్గాలు పేర్కొంటున్నాయి. పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేసి కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యను పరిష్కరించాలని ఉద్యోగులు, లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రజావాణి వినతులు గడువులోగా పరిష్కరించాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**



కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి: ప్రజావాణికి వచ్చే వినతులను నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో భూ వివాదాలు, రెవెన్యూ, సంక్షేమ పథకాలు, ఉపాధి, పెన్షన్లు, గృహాలు, మౌలిక వసతులు తదితర అంశాలపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును ప్రాధాన్యంతో పరిశీలించి సంబంధిత శాఖలకు వెంటనే పంపించాలని, తక్షణమే పరిష్కరించగల సమస్యలను ఆలస్యం చేయవద్దని సూచించారు. క్లిష్టమైన అంశాలపై నిరంతర పర్యవేక్షణతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వైన్ షాపుల అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

**న్యాయవాది బోడ వినయ్ కుమార్ డిమాండ్**



కాకతీయ, కారేపల్లి: సింగరేణి మండలంలో వైన్ షాపుల యజమానులు అధిక ధరలకు మద్యం విక్రయించడం, అక్రమ బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని న్యాయవాది బోడ వినయ్ కుమార్ డిమాండ్ చేశారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు నామమాత్రపు చర్యలకే పరిమితమవుతున్నారని విమర్శించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న వైన్ షాపులపై తెలంగాణ ఎక్సైజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుని, అవసరమైతే లైసెన్సులు రద్దు చేయాలని కోరారు. స్పందన లేకపోతే ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేస్తామని తెలిపారు. అధికారులు అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## రేగాపై చర్యలు తీసుకోవాలి : కాంగ్రెస్



- సస్పెన్షన్‌తో పాటు నిష్పక్షపాత విచారణకు సహకరించాలని డిమాండ్

**చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**

కాకతీయ, పినపాక : మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత రేగా కాంతారావును వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని పినపాక మండల కాంగ్రెస్ డిమాండ్ చేసింది. సోమవారం ఈ–బయ్యారం క్రాస్‌రోడ్డులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పేరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మహిళల గౌరవానికి సంబంధించిన అంశాల్లో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన బాధ్యత అన్ని పార్టీలపైనా ఉందన్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతపై బీఆర్ఎస్ పార్టీ తక్షణ క్రమశిక్షణ చర్యలు తీసుకుని, దర్యాప్తుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి బోడ రమేష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూణెం వెంకటేశ్వర్లు, దిశ కమిటీ మండల అధ్యక్షుడు మద్దెల సమ్మయ్య తదితరులు మాట్లాడుతూ మహిళల భద్రత విషయంలో రాజీకి తావులేదన్నారు. ఆరోపణలపై చట్టప్రకారం పారదర్శక విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆరోపణలపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో విశ్వాసం కలిగేలా బీఆర్ఎస్ స్పందించాలని కోరారు. పార్టీ స్పందించకపోతే మహిళలతో కలిసి మండల వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు పాల్గొన్నారు.

## బకాయిలు వెంటనే విడుదల చేయాలి

**విద్యార్థి నాయకుడు రాకేష్ దత్త**

**హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్‌కు వినతిపత్రం**



కాకతీయ, మయూరి సెంటర్: రాష్ట్రంలోని డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి నాయకుడు రాకేష్ దత్త ఆధ్వర్యంలో హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఫీజు బకాయిల కారణంగా కొన్ని కళాశాలలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. జూనియర్ కళాశాలల్లో అనుమతులు లేకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్న అంశాన్ని కూడా చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేకుంటే దశలవారీగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.

## ఏఐటీయూసీ మహాసభలను విజయవంతం చేయాలి

- జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు
- సత్తుపల్లి మహాసభలకు కార్మికులకు పిలుపు



కాకతీయ, ఖమ్మం రూరల్: ఈనెల 23న సత్తుపల్లిలో జరిగే ఏఐటీయూసీ జిల్లా 17వ మహాసభలను కార్మికులంతా విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. మహాసభల ప్రచారంలో భాగంగా ఎదులాపురం, వరంగల్ క్రాస్‌రోడ్డు, పెద్దతండా, రెడ్డిపల్లి ప్రాంతాల్లో కార్మికులతో సమావేశాలు నిర్వహించారు. కార్మికుల పని పరిస్థితులు, కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ఈపీఎఫ్, ఈఎస్ఐ, సంక్షే మ పథకాల అమలుపై చర్చించారు. మహాసభలు కార్మిక ఉద్యమ భవిష్యత్ కార్యాచరణకు కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆకిన పవన్, బల్లి ఉపేంద్ర, ఆర్. నారాయణరెడ్డి, వీరన్న, హస్సన్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలే శిశువుకు ఉత్తమ పోషకాహారం

**నేరడ-1 అంగన్‌వాడీలో తల్లిపాల వారోత్సవాలు**

**ఐసీడీఎస్ లక్ష్యాలపై అవగాహన**



కాకతీయ, చింతకాని: మండలంలోని నేరడ–1 అంగన్‌వాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ చావా కమలప్రియ మాట్లాడుతూ తల్లి, బిడ్డల ఆరోగ్య పరిరక్షణే ఐసీడీఎస్ ప్రధాన లక్ష్యమన్నారు. పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలే శిశువుకు సంపూర్ణ పోషకాహారమని తెలిపారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత, ప్రసవ సమస్యలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి, ఉప సర్పంచ్ ముత్తయ్య, ఏఎన్ఎం లక్ష్మి, గ్రామసెక్రటరీ అర్జున్,అంగన్‌వాడీటీచర్,ఆశకార్యకర్తలు,తల్లులు పాల్గొన్నారు.

## అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాలి

**ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీలకు ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్**

**11 డిమాండ్లతో కలెక్టరేట్ ముట్టడించిన డీహెచ్‌పీఎస్**



కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి : అసైన్డ్, ఇనాం భూములకు పూర్తి స్థాయి పట్టా పాస్‌బుక్కులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ డీహెచ్‌పీఎస్ (దళిత్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ) ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో దళితులు, బహుజన సంఘాల నాయకులు పాల్గొని ప్రభుత్వం తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో దళితులకు ప్రాధాన్యం ఇవ్వాలని, పేదలకు ఇంటి స్థలాల పట్టాలు, డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను పునరుద్ధరించడం, గ్రామాల్లో బెల్ట్‌షాపులను నియంత్రించడం, పారిశ్రామిక రుణాల సబ్సిడీలు, బీఏఎస్ పథకం నిధులను విడుదల చేయాలని కోరారు. అలాగే ప్రైవేట్ రంగంలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయడం, ఎస్సీ హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించడం, ఏజెన్సీ ప్రాంతాల్లో ఎస్సీలకు ఇంటి నంబర్లు, పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వానపాకుల రాంబాబు, అల్లూరి సాంబశివరావు, టీపీసీసీ మీడియా కమ్యూనికేషన్ సభ్యుడు సురేందర్, మల్లేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ క్లినిక్‌పై ఆకస్మిక తనిఖీ

**జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ప్రదీప్**

**అర్హతలకు మించి వైద్య సేవల ఆరోపణలపై పరిశీలన**



కాకతీయ, ఏన్కూర్: ఏన్కూర్ మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ క్లినిక్‌లో అర్హతలకు మించి వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డా. ప్రదీప్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. క్లినిక్‌లో రోగుల రిజిస్టర్లు, చికిత్స రికార్డులు, అనుమతులు, వైద్య సిబ్బంది అర్హతలను పరిశీలించి నిర్వాహకుడి నుంచి వివరణ తీసుకున్నారు. సేకరించిన వివరాలపై నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తెలిపారు. నిబంధనల ఉల్లంఘన తేలితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రైవేట్ ఆస్పత్రులు, క్లినిక్‌లు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## అంగన్‌వాడీ భవనానికి 200 గజాల భూదానం

- పేరుపల్లిలో పర్సా కుటుంబం ఉదారత
- గ్రామపంచాయతీ తీర్మానంతో భవన నిర్మాణానికి మార్గం



కాకతీయ, కారేపల్లి: కారేపల్లి మండలం పేరుపల్లి–2 అంగన్‌వాడీ కేంద్రం శాశ్వత భవన నిర్మాణం కోసం పర్సా సూర్యప్రకాశరావు–ఛాయాదేవి కుటుంబం తమకు చెందిన 200 గజాల స్థలాన్ని విరాళంగా అందజేసింది. భూదానానికి సంబంధించిన పత్రాలను సర్పంచ్ బానోత్ పద్మావతికి అందజేయగా, గ్రామపంచాయతీ ఏకగ్రీవ తీర్మానంతో భవన నిర్మాణానికి ఆమోదం తెలిపింది. అనంతరం తీర్మాన ప్రతులను ఐసీడీఎస్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యశీల, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు సుశీల, సీత, విజయ తదితరులు పాల్గొన్నారు.

## మురుగునీటికి శాశ్వత పరిష్కారమే లక్ష్యం

**సీపీఐ కౌన్సిలర్ దండి రంగారావు**




కాకతీయ, ఖమ్మం రూరల్: ఏదులాపురం మున్సిపాలిటీ 28వ వార్డులో నూతన డ్రైనేజీ నిర్మాణ పనులకు సోమవారం సీపీఐ కౌన్సిలర్ దండి రంగారావు శంకుస్థాపన చేశారు. వార్డులో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించే లక్ష్యంతో పనులు చేపట్టినట్లు తెలి పారు. డ్రైనేజీ నిర్మాణం పూర్తయితే వర్షాకాలంలో నీరు నిల్వ లేకుండా పార డంతో పాటు దోమల వ్యాప్తి తగ్గి పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. పనులు ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ దండి రంగారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీవాసులు పాల్గొన్నారు.

## గ్రీవెన్స్ డేకు ఆలస్యంగా ఎమ్మార్వో

**గంటల తరబడి వేచిచూసిన ప్రజలు**

**వినతుల పరిష్కారంలో జాప్యంపై అసంతృప్తి**



కాకతీయ, ఏన్కూర్: ఏన్కూర్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డేలో మండల తహసీల్దార్ (ఎమ్మార్వో) ఆలస్యంగా హాజరుకావడంతో ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. ఇతర శాఖల అధికారులు సమయానికి చేరుకున్నప్పటికీ, ఉదయం 11 గంటలు దాటినా ఎమ్మార్వో అందుబాటులో లేకపోవడంతో భూ వివాదాలు, పట్టాదారు పాస్‌బుక్లు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాలకు సంబంధించిన పలు వినతుల పరిష్కారం ఆలస్యమైంది. ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహించే కార్యక్రమాల్లో అధికారులు సమయపాలన పాటించాలని స్థానికులు కోరారు. ఎమ్మార్వో ఆలస్యానికి గల కారణాలపై అధికారిక సమాచారం వెల్లడికాలేదు.

## కారేపల్లి సొసైటీ ప్రహరీ గోడ నిర్మాణానికి శ్రీకారం

**ఎమ్మెల్యే నిధులతో పనుల ప్రారంభం**

**రైతు సేవల విస్తరణకు ఎఫ్‌పీఓలో చేరాలని పిలుపు**



కాకతీయ, కారేపల్లి : కారేపల్లి సహకార సంఘం ప్రహరీ గోడ నిర్మాణ పనులను సోమవారం సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ) ప్రారంభించారు. వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి మంజూరైన రూ.5 లక్షలతో ఈ పనులు చేపట్టారు. రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు సొసైటీ అనుబంధంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్‌పీఓ) ఏర్పాటు చేశామని, సభ్యత్వం పొందాలని దుగ్గినేని శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు తోటకూరి రాంబాబు, కార్యదర్శి బొల్లు హనుమంతరావు, ఉపసర్పంచ్ పెద్దమ్మ భాగ్యలక్ష్మి, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములపై మళ్లీ కన్నేశారా..?

- హుజురాబాద్‌లో రూ.2 కోట్ల ప్రభుత్వ స్థలంపై కబ్జా యత్నాల ఆరోపణలు
- సర్వే నంబర్ 236లో పట్టాల కోసం మళ్లీ కదలికలు
- రెవెన్యూ అధికారుల పాత్రపై అనుమానాలు
- కలెక్టర్ జోక్యంతో సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్



కాకతీయ, కరీంనగర్ / హుజురాబాద్ : హుజురాబాద్ పట్టణంలోని గణేష్‌నగర్ సర్వే నంబర్ 236లోని ప్రభుత్వ భూములపై మరోసారి కబ్జా ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రస్తుతం దాదాపు రూ.2 కోట్ల విలువ చేసే ఈ భూములను కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్థికంగా బలమైన వ్యక్తులు రెవెన్యూ అధికారుల సహకారంతో తమ పేర్లపై పట్టాలు పొందేందుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. గతంలో ప్రభుత్వ ఆధీనంలోకి వెళ్లిన భూములపై మళ్లీ హక్కులు సాధించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### వ్యవసాయం పేరుతో భూముల కేటాయింపు

స్థానికుల కథనం ప్రకారం, సుమారు 24 సంవత్సరాల క్రితం సర్వే నంబర్ 236లో కొందరికి తలా 10 గుంటల చొప్పున వ్యవసాయం చేసుకునేందుకు పాస్ పుస్తకాలు జారీ చేశారు. అయితే, భూములు పొందిన వారు ఎలాంటి సాగు చేయకపోవడంతో వాటి వినియోగంపై అప్పట్లోనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అనంతరం ప్రభుత్వం సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసి భూములను తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఆ తర్వాత ఈ భూములను నిరుపేదల కోసం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణానికి వినియోగించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

### భూమి విలువ పెరగడంతో కొత్త ఎత్తుగడలు

ఇటీవలి కాలంలో గణేష్‌నగర్ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరగడంతో సర్వే నంబర్ 236పై మళ్లీ కొందరి దృష్టి పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములకే మరోసారి పట్టాలు పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇందుకు కొందరు రెవెన్యూ అధికారుల సహకారం కూడా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ భూముల పరిరక్షణలో అధికార యంత్రాంగం వైఖరిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. సర్వే నంబర్ 236కు సంబంధించిన పూర్తి భూ రికార్డులను పరిశీలించి, ప్రస్తుతం ఎలాంటి రెవెన్యూ ప్రక్రియలు కొనసాగుతున్నాయో జిల్లా యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చిన భూములపై ప్రస్తుతం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో వెల్లడించాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూములను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని సమగ్ర విచారణ నిర్వహించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, ఈ భూములను ప్రజా ప్రయోజనాల కోసం, ముఖ్యంగా నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. రెవెన్యూ యంత్రాంగంపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## హుజూరాబాద్ ఐసీడీఎస్‌లో 16 అంగన్‌వాడీ టీచర్ పోస్టులు

**ఆగస్టు 15 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు**

**స్థానిక ఇంటర్ అర్హత మహిళలకు అవకాశం**

కాకతీయ, కరీంనగర్/హుజూరాబాద్: హుజూరాబాద్ ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న 16 అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ ఎం. సుగుణ తెలిపారు. ఆగస్టు 15 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన స్థానిక మహిళలు మాత్రమే అర్హులు. 2026 జూలై 1 నాటికి 18–35 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి. సైదాపూర్ 6, జమ్మికుంట 5, హుజూరాబాద్ 3, వీణవంక 1, ఇల్లందకుంట 1 చొప్పున పోస్టులు ఉన్నాయి. ఖాళీలు, రిజర్వేషన్లు, ఎంపిక విధానం, దరఖాస్తుల వివరాలకు మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## ఉల్లంపల్లి గ్రామసభలో కీలక తీర్మానాలు

**ఆర్‌వో ప్లాంట్, గ్రంథాలయం, పీహెచ్‌సీ ఏర్పాటుకు తీర్మానం**

**గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంపై దృష్టి**



కాకతీయ, చిగురుమామిడి: ఉల్లంపల్లి గ్రామపంచాయతీలో సోమవారం సర్పంచ్ అలువాల శంకర్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో పలు అభివృద్ధి తీర్మానాలను ఆమోదించారు. 20 శాతం ప్రజల భాగస్వామ్యం, 80 శాతం బాలవికాస్ సంస్థ సహకారంతో ఆర్‌వో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గ్రామంలో గ్రంథాలయం, వెటర్నరీ ఆసుపత్రి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు ప్రభుత్వాన్ని కోరారు. ఓదెల మల్లికార్జున స్వామి దేవాలయ కార్యక్రమాలు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని గ్రామసభ తీర్మానించింది. సమావేశంలో వార్డు సభ్యులు కొల రజిత, కానవేని రజినీకాంత్, పంచాయతీ కార్యదర్శి జ్యోతి, వివో శ్రీలత, పద్మ, శారద, జమున, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై పోలీసుల దాడి

**ఇద్దరిపై కేసు నమోదు**

కాకతీయ, మద్దూరు: మద్దూరు పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకం, రవాణాపై పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. గాగిళ్లపూర్–లింగాపూర్ గ్రామాల మధ్య ఉన్న మోహితుమ్మెద వాగు వద్ద తనిఖీలు చేపట్టి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న అశోక్ లేలాండ్ వాహనం, జాన్ డీర్ ట్రాక్టర్–ట్రాలీని స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో గాగిళ్లపూర్ గ్రామానికి చెందిన నారపల్లి రాజు, బోయిని సిద్దులుపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ ఆశిఫ్ తెలిపారు.

## కులం పేరుతో దూషణలు.. బెదిరింపు ఆడియోలపై కేసు



కాకతీయ,మద్దూరు : మండలంలోని నర్సయపల్లి గ్రామానికి చెందిన ముస్త్యాల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామ వాట్సాప్ గ్రూపులో కులం పేరుతో దూషిస్తూ, అవమానకరంగా మాట్లాడటంతో పాటు బెదిరింపు ఆడియో సందేశాలు పోస్టు చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.ఈ ఘటనకు సంబంధించి చింతల సదానంద్‌తో పాటు వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ పోతూగంటి రవీందర్ గౌడ్‌పై ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఘటనకు సంబంధించిన వివరాలను తెలుసుకునేందుకు హుస్నాబాద్ ఏసీపీ సంఘటన స్థలాన్ని సందర్శించి విచారణ చేపట్టారు. వాట్సాప్ గ్రూపులో పోస్టు చేసిన సందేశాలు, ఆడియోలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు

**రుద్రంగిలో పోలీసుల స్పెషల్ డ్రైవ్**

**మద్యం సేవించి వాహనం నడిపితే కఠిన చర్యలు**



కాకతీయ, రుద్రంగి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో సోమవారం ఎస్సై మోతిరాం ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. కోరుట్ల–వేములవాడ ప్రధాన రహదారిపై వాహనదారులకు బ్రెత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించి మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటుబెల్ట్ ధరించాలని ఎస్సై సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్, అధిక వేగం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం ప్రమాదాలకు కారణమవుతాయని హెచ్చరించారు. తనిఖీల్లో ఏఎస్సై జగదీష్, కానిస్టేబుళ్లుమధు,శంకర్,విక్రమ్,హెడ్కానిస్టేబుళ్లురాము,అంజి పాల్గొన్నారు.

## తల్లిపాలపై విస్తృత అవగాహన కల్పించాలి



- ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరించిన అదనపు కలెక్టర్లు

కాకతీయ, కరీంనగర్ : శిశువుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో అవసరమని, వాటి ప్రాముఖ్యతపై గ్రామస్థాయి వరకు విస్తృత అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఈనెల 7వ తేదీ వరకు నిర్వహించనున్న కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశ్విని తానాజీ మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు తల్లిపాల ఆవశ్యకతపై సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. శిశువు జన్మించిన గంటలోపే ముర్రుపాలు పట్టించడం ఎంతో కీలకమని, ముర్రుపాలలో ఉండే రోగనిరోధక శక్తి శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడానికి దోహదపడుతుందని తెలిపారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులను సందర్శించి గర్భిణీలు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై కౌన్సిలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలలు తప్పనిసరిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాలను కొనసాగించాలని వివరించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల్లో ప్రత్యేక అవగాహన సమావేశాలు నిర్వహించి తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఐసిడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రుద్రంగిలో నేడు ఏటీసీ నిర్మాణానికి శ్రీకారం



**రూ.46 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్**

**మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరు**

కాకతీయ, రుద్రంగి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలో రూ.46 కోట్ల వ్యయంతో నిర్మించనున్న అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) భవన నిర్మాణ పనులకు మంగళవారం శ్రీకారం చుట్టనున్నట్లు ఏఎంసీ చైర్మన్ చేలుకల తిరుపతి తెలిపారు. ప్రారంభోత్సవానికి రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ హాజరుకానున్నారు. ఈ కేంద్రంలో 260 మంది విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సర్పంచ్ గండి నారాయణ, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎర్రం గంగ నరసయ్య, ఆలయ చైర్మన్ సామ మోహన్ రెడ్డి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గట్ల మీనయ్య, తర్రె మనోహర్, కోమిరె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ విధానాలపై సీపీఐ ప్రచార యాత్ర




- ఆగస్టు 6 నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు
- జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

కాకతీయ, కరీంనగర్: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆగస్టు 6 నుంచి 14 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రచార యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్లో బండ రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతులకు కనీస మద్దతు ధర, విద్య, వైద్యం, కార్మికుల సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. 'బద్లావ్ జరూరీ హై–మార్పు కావాలి' పిలుపుతో ప్రచార యాత్ర చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో పొనగంటి కేదారి, అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, గోవిందుల రవి, చొక్కల్ల శ్రీశైలం, లంకదాసరి కల్యాణ్, ఎస్.కే. మౌలానా తదితరులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కాకతీయ,చేర్యాల : మండలంలోని పాత దొమ్మట శివారులోని కమలాయిపల్లి చెరువు సమీపంలో డబ్బులు పెట్టి పేకాట ఆడుతున్న స్థావరంపై చేర్యాల పోలీసులు దాడి చేశారు. పోలీసులను చూసి ఏడుగురు వ్యక్తులు పారిపోగా, ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పట్టుబడిన వారి వద్ద నుంచి రూ.1,000 నగదు, రెండు సెల్‌ఫోన్లు, అలాగే పారిపోయిన వారు వదిలివెళ్లిన రూ.1,200 నగదు, 52 పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రూ.2,200 నగదు, రెండు సెల్‌ఫోన్లు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నడుచుకుంటూ వెళ్తూ కుప్పకూలిన యువకుడు



కాకతీయ, వేములవాడ: వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో సోమవారం విషాద ఘటన చోటు చేసుకుంది. కోరేపు దుర్గప్రసాద్ (31) రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు వెంటనే వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రాథమిక సమాచారం ప్రకారం గుండెపోటే మరణానికి కారణమైనట్లు తెలుస్తోంది. వృత్తిరీత్యా పెయింటర్‌గా పనిచేస్తున్న దుర్గప్రసాద్‌కు భార్య, ఒక చిన్నారి కుమార్తె ఉన్నారు. యువకుడి ఆకస్మిక మృతితో అంబేద్కర్ నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పెద్దమ్మతల్లికి అరకిలో వెండి కిరీటం బహూకరణ



కాకతీయ, కరీంనగర్/హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని రంగనాయకుల గుట్ట వద్ద ఉన్న శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివంగత రావనవేణి మురళి (ఎస్‌టీఓ) స్మారకార్థం ఆయన సతీమణి విమల, కుమారులు సాయిరాం, వంశీ అమ్మవారికి అరకిలో వెండి కిరీటాన్ని సమర్పించారు. వేదమంత్రోచ్చారణల మధ్య అమ్మవారికి కిరీటాన్ని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దాతలను ఆలయ కమిటీ సన్మానించింది. ఈ నెల 5న పోచమ్మతల్లి బోనాలు, 6న శ్రీ పెద్దమ్మతల్లి బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో గుడ్డేలుగుల సమ్మయ్య, పోచయ్య, గోస్కుల సమ్మయ్య, వెంకన్న, కొలిపాక సమ్మయ్య, మౌటం శ్రీనివాస్, పిల్లి సమ్మయ్య, భూమ్ సాయికృష్ణ, రావనవేణి రాజేశం, రమేష్, భాస్కర్, బుర్రి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై విద్యార్థుల రాస్తారోకో




కాకతీయ, గంభీరావుపేట: ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం గంభీరావుపేట మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. సిద్దిపేట–కామారెడ్డి ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టి, స్కాలర్‌షిప్‌ల విడుదలతో పాటు నిరుద్యోగులకు 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ నాయకుడు కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. డిమాండ్లు నెరవేర్చకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.